సంపుటి :02 సంచిక :299 పేజీలు :06 వెల ₹5

అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

శుక్రవారం 06, ఫిబ్రవరి 2026

# సీఎం సభను సక్సెస్ చేయండి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- చెల్పూరులో భారీ బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన

04



# అడవిలో తూటాల గర్జన..

- తొమ్మిది మంది మావోల ఖతం!
- ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర సరిహద్దులో భారీ ఎన్‌కౌంటర్

04



మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా కేంద్రం చేపట్టిన 'ఆపరేషన్ కగార్' అడవిని వణికిస్తోంది. ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్ మరువకముందే, తాజాగా ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర సరిహద్దులో మరో భారీ కాల్పుల మోత మోగింది. గడ్చిరోలి-నారాయణపూర్ జిల్లాల సరిహద్దులోని పొదెవాడ అటవీ ప్రాంతంలో జరిగిన ఈ భీకర పోరులో తొమ్మిది మంది మావోయిస్టులు మృతి చెందారు.

– అక్షర దర్బార్, ప్రధాన ప్రతినిధి



"సింగరేణి గడ్డపై రాజకీయ సెగలు రాజుకున్నాయి. మున్సిపల్ పీఠమే లక్ష్యంగా భూపాలపల్లిలో 'గండ్ర' యుద్ధం పీక్ స్టేజ్‌కు చేరింది. అధికార కాంగ్రెస్ తన మిత్రపక్షాలతో కలిసి హస్తం స్పీడ్ పెంచగా.. కారు జోరును ప్రదర్శించేందుకు బీఆర్ఎస్ సర్వశక్తులు ఒడ్డుతోంది. అభివృద్ధి మంత్రం ఒకరు.. జిల్లా ఉనికి అస్త్రం మరొకరు.. ఇలా విమర్శల జడివానలో పురపోరు రసవత్తరంగా మారింది. గెలుపు మాదంటే మాదని ఇరు వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్న వేళ.. సింగరేణి ఓటరు ఎటు మొగ్గుతాడన్నది జిల్లావ్యాప్తంగా ఉత్కంఠ రేపుతోంది. ఎల్లుండి సీఎం రేవంత్ రెడ్డి రాకతో ఈ ఎన్నికల వాతావరణం మరింత హీటెక్కనుంది."

– అక్షర దర్బార్, భూపాలపల్లి

- సింగరేణి గడ్డపై రసవత్తర రాజకీయం
- కాంగ్రెస్ లెఫ్ట్ కూటమి వర్సెస్ బీఆర్ఎస్ నువ్వా నేనా!
- మెజారిటీ వార్డుల్లో ముఖాముఖి పోటీ
- ఎన్నికలవేళ మరింత హీటెక్కిన వాతావరణం
- హోరాహోరీ పోరుతో ఆసక్తి రేపుతున్న పురపోరు

# టఫ్ ఫైట్

## భూపాలపల్లిలో గండ్ర వర్సెస్ గండ్ర

02



# రాజకీయ 'కత్తెర'లో మహిళల ఉపాధి!

- మూడేళ్లుగా బడిలోనే 'బందీ' అయిన కుట్టుమిషన్లు

- సింగరేణి సంస్థ ఔదార్యం.. నాయకుల పంతం
- 50 మిషన్లలో కొన్ని మాయం.. తుప్పు పడుతున్న యంత్రాలు

"సింగరేణి సంస్థ కన్నతల్లిలా కనికరించి పేద మహిళల ఉపాధి కోసం లక్షల రూపాయల విలువైన కుట్టుమిషన్లు ఇస్తే.. స్థానిక నాయకులు మాత్రం సవతి తల్లి ప్రేమను వలకబోస్తున్నారు. రాజకీయ పంతాల మధ్య పేద మహిళల ఆశలు కత్తెరకు బలైపోతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, నాయకుల ఆధిపత్య పోరు వెరసి మూడేళ్లుగా ఆ మిషన్లు బడి గదుల్లోనే 'బందీ' అయ్యాయి. చివరకు మహిళల జీవితాలను కుట్టాల్సిన ఆ యంత్రాలు.. ఇప్పుడు తుప్పు పడుతూ పాత ఇనుముగా మారుతున్నాయి."

– అక్షరదర్బార్, మొగుళ్ళపల్లి

04

# స్పీకర్ సార్.. ఇక సాగదీత వద్దు!

- ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీం సీరియస్..
- 'మూడు వారాలే' డెడ్ లైన్





05

# ఆకట్టుకునేలా ప్రచారం



- టీ తయారుచేసిన ఎమ్మెల్యే నాగరాజు
- బిర్యానీ పెట్టిన యశస్వినిరెడ్డి
- మిర్చీలు చేసిన మాజీ మంత్రి ఎర్రబెల్లి

05

# టఫ్ ఫైట్

## భూపాలపల్లిలో గండ్ర వర్సెస్ గండ్ర




- సింగరేణి గడ్డపై రసవత్తర రాజకీయం
- కాంగ్రెస్ లెఫ్ట్ కూటమి వర్సెస్ బీఆర్ఎస్ నువ్వా నేనా!
- మెజారిటీ వార్డుల్లో ముఖాముఖి పోటీ
- జిల్లా మార్పు చుట్టూ తిరుగుతున్న ప్రచారం
- ఎల్లుండి సీఎం రేవంత్ రెడ్డి పర్యటన
- ఎన్నికలవేళ మరింత హీటెక్కిన వాతావరణం
- హోరాహోరి పోరుతో ఆసక్తి రేపుతున్న పురపోరు

**అక్షరదర్బార్, భూపాలపల్లి :** మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకొని భూపాలపల్లిలో పొలిటికల్ వార్ నడుస్తుంది. పురపోరులో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి ఎన్నికల బరిలో దిగిన అభ్యర్థులు ఓట్ల వేటలో పడ్డారు. ఎవరికి వారే తమ గెలుపే లక్ష్యంగా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రధానంగా ఈ మున్సిపాలిటీ పరిధిలో ద్విముఖ పోటీ కనబడుతుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు, కాంగ్రెస్ మిత్ర పక్షాలైన సీపీఐ, సీపీఎం అభ్యర్థులు నువ్వా నేనా అనే రీతిలో ఇక్కడ తలపడుతున్నారు. ఈ క్రమంలో తమ అభ్యర్థుల గెలుపు కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల ముఖ్య నేతలు వ్యూహ ప్రతి వ్యూహాలను అమలు చేస్తున్నారు. ముఖ్యంగా అధికార పార్టీకి చెందిన స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, బీఆర్ఎస్ కు చెందిన మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి భూపాలపల్లి మున్సిపాలిటీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నారు. మెజారిటీ వార్డుల్లో విజయం సాధించి మున్సిపాలిటీ కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారు. ఒకరిపై ఒకరు విమర్శనాస్త్రాలు సంధిస్తూ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. దీంతో ఇక్కడ పురపోరు రసవత్తరంగా మారింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య సాగుతున్న మాటల యుద్ధం ఆసక్తి రేపుతుంది. ప్రతి వార్డులోనూ ప్రత్యర్థుల మధ్య హోరాహోరి పోటీ నెలకొంది.

### - తగ్గేదేలే అనే రీతిలో

ఉమ్మడి వరంగల్ లో భూపాలపల్లి మున్సిపాలిటీకి ప్రత్యేకత ఉంది. పారిశ్రామికంగా అభివృద్ధిలో పరుగు పెడుతున్న ఈ మున్సిపాలిటీ పరిధిలోని ఓటర్లలో సింగరేణి కార్మికులు ఉన్నారు. వివిధ వర్గాల ఓటర్లు ఉండటంవల్ల ఇక్కడ ప్రతి ఎన్నికల్లోనూ ఫలితాలు అంచనాకు అందని పరిస్థితి. ఓటర్ల సంఖ్యలో ఉమ్మడి వరంగల్లో మెహబూబా తర్వాత భూపాలపల్లి మున్సిపాలిటీ రెండో స్థానంలో ఉంది 30 వార్డులు కలిగి ఉన్న ఈ మున్సిపాలిటీ పరిధిలో మొత్తం ఓటర్ల సంఖ్య 52,786. వీరిలో మహిళలు 25,936, పురుషులు 26,786 మంది కాగా ఇతరులు నలుగురు ఉన్నారు. 30 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ సీపీఐతో పాటు సీపీఎంతో పొత్తు కుదుర్చుకొని మున్సిపల్ ఎన్నికల బరిలోకి దిగింది. నాలుగు వార్డులను సీపీఐకి, ఒక వార్డును సీపీఎం పార్టీకి కేటాయించిన కాంగ్రెస్ పార్టీ 25 వార్డుల నుంచి తమ పార్టీ అభ్యర్థులను ఎన్నికల బరిలో నిలిపింది. దీంతో 30 వార్డుల్లో కాంగ్రెస్ దాని మిత్రపక్షాల అభ్యర్థులు బరిలో ఉండగా బీఆర్ఎస్ 30 వార్డుల్లో తమ పార్టీ అభ్యర్థులను పోటీకి దింపింది. అయితే బీజేపీ కూడా ఇక్కడ తమ పార్టీ అభ్యర్థులను బరిలో దించినప్పటికీ నాలుగైదు వార్డుల్లో మాత్రమే ఆ పార్టీ గట్టి పోటీ ఇస్తున్నట్లు తెలిసింది. ఫలితంగా ఈ నాలుగైదు వార్డుల్లో త్రిముఖ పోటీ జరుగుతుండగా మిగతా మెజారిటీ వార్డుల్లో కాంగ్రెస్, దాని మిత్ర పక్షాల అభ్యర్థులు, బీఆర్ఎస్ అభ్యర్థుల మధ్య ముఖాముఖి పోటీ నెలకొంది. నామినేషన్లు ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత మంగళవారం సాయంత్రం నుంచి భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఎన్నికల ప్రచారం ఉధృతమైంది. బరిలో నిలిచిన ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు తగ్గేదేలే అని రీతిలో ప్రచారంలో పోటీ పడుతున్నారు. ఇక తమ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ ముఖ్య నేతలు ఇక్కడ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్సీ, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి కూడా శుక్రవారం ఇక్కడ ప్రచారంలో పాల్గొన్నారు. మంత్రి శ్రీధర్ బాబు స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ నెల 8న భూపాలపల్లి జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించనున్నారు.

### - విమర్శల దాడి

ఈ ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారా భూపాలపల్లి మున్సిపాలిటీని దక్కించుకోవటాన్ని స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సవాల్ గా తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఒకరిపై మరొకరు విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడ ఎన్నికల ప్రచారంలో జిల్లా మార్పు అనేది ప్రధాన అంశంగా మారింది. టిఆర్ఎస్ పాలనలో భూపాలపల్లి కేంద్రంగా కొత్త జిల్లా ఆవిర్భవిస్తే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాల తగ్గింపు పేరుతో భూపాలపల్లి జిల్లాను ఎత్తివేసే పనిలో ఉందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి తన ప్రచారంలో పేర్కొంటున్నారు. ఈ అంశంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రస్తావిస్తూనే గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆ పార్టీ ప్రజలకు ఇచ్చిన పలు హామీలను అమల్లో పెట్టలేదని, భూపాలపల్లి పట్టణ అభివృద్ధిని స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడంలేదని విరుచుక పడుతున్నారు. ఇక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఎన్నికల ప్రచారంలో భాగంగా వెంకటరమణారెడ్డి కేవలం రాజకీయ లబ్ది పొందడానికే కాంగ్రెస్ పై ఆరోపణలు చేస్తున్నారని, జిల్లా ఎక్కడికి పోదని గట్టిగా స్థానికులకు చెప్తున్నారు. భూమి ఆకాశం ఉన్నంతవరకు భూపాలపల్లి జిల్లా ఉంటుందని అంటున్నారు. అంతేకాదు బుధవారం భూపాలపల్లి లో ప్రచారంలో పాల్గొన్న రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు కూడా భూపాలపల్లి జిల్లా ఎక్కడికి పోదు ఇక్కడే ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గత రెండేళ్లలో భూపాలపల్లి అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే సత్యనారాయణరావు ప్రచారంలో ప్రజలకు వివరిస్తున్నారు. ఏది ఏమైనా భూపాలపల్లి మున్సిపాలిటీలో ప్రధాన రాజకీయ పార్టీల మధ్య జరుగుతున్న హోరాహోరీ పోరు రసవత్తరంగా మారింది.

## రెండోరోజు రూ.3.54 కోట్లు

అక్షరదర్బార్, హనుమకొండ: వనదేవతలు సమ్మక్క–సారలమ్మల గద్దెల వద్ద భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు ప్రక్రియ అత్యంత వేగంగా, పారదర్శకంగా కొనసాగుతోంది. రెండో రోజైన శుక్రవారం కూడా భక్తుల మొక్కుబడుల రూపంలో భారీగా ఆదాయం సమకూరింది. రెండో రోజు మొత్తం 160 హుండీలను అధికారులు తెరిచి లెక్కించారు. ఇందులో నగదు రూపంలో రూ.3,54,25,200 ఆదాయం వచ్చినట్లు దేవదాయ శాఖ అధికారులు ప్రకటించారు. జాతర ముగిసిన అనంతరం జరుగుతున్న ఈ లెక్కింపులో ఇప్పటివరకు మొత్తం 285 హుండీలను పూర్తి చేశారు. మొదటి రోజు ఆదాయం రూ.2,50,28,436, రెండో రోజు ఆదాయం రూ.3,54,25,200 మొత్తం 2 రోజులు కలిపి రూ.6,04,53,636 ఆదాయం సమకూరింది. పూర్తయిన హుండీల సంఖ్య 285. హనుమకొండ లోని టి.టి.డి కళ్యాణ మండపంలో జరుగుతున్న ఈ లెక్కింపు ప్రక్రియను అధికారులు నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. లెక్కింపు జరుగుతున్న హాల్ అంతా నిరంతరం సిసి కెమెరాల పర్యవేక్షణలో ఉంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా పోలీసు బలగాలను మోహరించారు.శనగదుతో పాటు భక్తులు సమర్పించిన బంగారం, వెండి వస్తువులను కూడా అధికారులు ప్రత్యేకంగా వేరు చేసి భద్రపరుస్తున్నారు.

## డోర్నకల్ 'కోఆర్డినేటర్'గా గాజర్ల అశోక్

- మేడ్చల్ సక్సెస్  తో బాధ్యతలు అప్పగించిన టీపీసీసీ చీఫ్
- మున్సిపల్ ఎన్నికల గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ వ్యూహం

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగనున్న తరుణంలో అధికార కాంగ్రెస్ పార్టీ తన వ్యూహాలకు పదును పెడుతోంది. ఈ క్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి, మాజీ ఉద్యమనేత గాజర్ల అశోక్ (ఐతు)కు పార్టీ అధిష్టానం అత్యంత కీలకమైన బాధ్యతలను అప్పగించింది.  డోర్నకల్ మున్సిపాలిటీ ఎన్నికల కోఆర్డినేటర్ గా అశోక్ ను నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు.



### మేడ్చల్ ఫలితమే ఈ గుర్తింపు..

ఇటీవల మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా డీసీసీ కార్యవర్గ కూర్పులో టీపీసీసీ పరిశీలకుడిగా గాజర్ల అశోక్ చూపిన చొరవ పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. జిల్లాలోని మేడ్చల్, ఉప్పల్, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి వంటి కీలక నియోజకవర్గాల్లో పర్యటించి, గ్రూపు రాజకీయాలకు తావులేకుండా పార్టీ కేడర్ తో మమేకమయ్యారు. సామాజిక సమీకరణాలను, మహిళా ప్రాతినిధ్యాన్ని పరిగణనలోకి తీసుకుంటూ 108 మందితో కూడిన పటిష్టమైన కార్యవర్గ జాబితాను రూపొందించి అధిష్టానానికి సమర్పించడంలో ఆయన సఫలీకృతులయ్యారు.

### సమన్వయ కర్తగా రణక్షేత్రంలోకి..

మేడ్చల్ జిల్లాలో అశోక్ చూపిన రాజకీయ చతురత, సమన్వయ శైలిని గుర్తించిన అధిష్టానం, ఇప్పుడు ఆయనను మున్సిపల్ ఎన్నికల రణక్షేత్రంలో డోర్నకల్ కోఆర్డినేటర్ గా నియమించింది. స్థానిక నాయకత్వానికి, జిల్లా కమిటీకి మధ్య వారధిగా ఉంటూ ప్రచార వ్యూహాలను రూపొందించడం లో ఆయన కీలక పాత్ర పోషించనున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెలిశాల గ్రామానికి చెందిన అశోక్ కు ఉన్న ఉద్యమ నేపథ్యం, ప్రజ లతో ఉన్న అనుబంధం డోర్నకల్ కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఊపును తీసుకువస్తోంది. డోర్నకల్ పై కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా అశోక్ క్షేత్రస్థాయి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఆయన నియామకం పట్ల ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

## పూర్ణచారిని భారీ మెజార్టీతో గెలిపించాలి

### గుజ్జుల వసంత మహేందర్ రెడ్డి

అక్షర దర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీ ఎన్నికల్లో 9వ వార్డు బీజేపీ అభ్యర్థి బెజ్జంకి పూర్ణచారిని భారీ మెజార్టీతో గెలిపించాలని గ్రేటర్ వరంగల్ 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్ రెడ్డి కోరారు. శుక్రవారం పరకాల పట్టణంలో పూర్ణచారి నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్న సమయంలో వారికి అండగా నిలిచిన నాయకుడు పూర్ణచారి అని పేర్కొన్నారు. సేవాభావం ఉన్న అభ్యర్థిని గెలిపించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.



## క్యాలెండర్ ఆవిష్కరణ

అక్షర దర్బార్, పరకాల: నడికూడ మండల కేంద్రంలో తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో 2026 సంవత్సరానికి సంబంధించిన నూతన క్యాలెండర్‌ను శుక్రవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మండల తహసీల్దార్ రాణి, ఎంపీడీఓ రామకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరై క్యాలెండర్‌ను విడుదల చేశారు.
ఈ సందర్భంగా సమితి నాయకులు మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమితి నాయకులు వరికెల కిషన్ రావు, బాబురావు, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఎన్నికల ప్రవర్తన నియమావళి తప్పనిసరి

### భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు




అక్షర దర్బార్, భూపాలపల్లి: మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పనిసరిగా పాటించాలని భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు సూచించారు. అనుమతి లేకుండా వాహనాలు, మైక్‌లు, ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించరాదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.





## 7వ వార్డులో కాంగ్రెస్ ప్రచార హోరు

### ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతా: పావుశెట్టి సునీల్

అక్షర దర్బార్, పరకాల: పరకాల మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 7వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పావుశెట్టి సునీల్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శుక్రవారం సీతారాంపురం ప్రాంతంలో ఓటర్లను కలిసి కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించిన ఆయన, అవకాశం ఇస్తే వార్డును అన్ని విధాల అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆశీస్సులతో 7వ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతానని తెలిపారు. ప్రచారం సందర్భంగా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నినాదాలు చేశారు.

## బీఆర్ఎస్ తోనే పరకాల అభివృద్ధి

### మాజీఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



అక్షర దర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ ప్రచారం వేగంగా సాగుతోంది. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 12వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి గంట కళావతి ప్రజల నుంచి విశేష స్పందన పొందారు. బీఆర్ఎస్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ హామీల అమలుపై ప్రశ్నలు లేవనెత్తారు. పరకాల అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గంట కళావతి మాట్లాడుతూ వార్డు అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో 2వ వార్డు అభ్యర్థి బొచ్చు శ్యామల బాబు రావు, 13వ వార్డు అభ్యర్థి దగ్గు సునీత, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## 15వ వార్డులో కమలం జోరు

మచ్చలేని అభ్యర్థి కుక్కల విజయ్‌కు మద్దతు

అక్షర దర్బార్, పరకాల: పరకాల మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 15వ వార్డు బీజేపీ అభ్యర్థి కుక్కల విజయ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్వర్ణకారుల వాడలో జరిగిన ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. కులాల ఆధారంగా కాకుండా అభ్యర్థి నిజాయితీ, పనితీరును చూసి ఓటు వేయాలని విజయ్ ప్రజలను కోరారు. పరకాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## తాడిచర్ల గ్రామాభివృద్ధికి సమిష్టి కృషి

### గ్రామసభ పనుల సమీక్షలో సర్పంచ్ బండి సామి

అక్షర దర్బార్, మల్హర్: మండల పరిధిలోని తాడిచర్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్ బండి సామి అధ్యక్షతన గ్రామసభ సమావేశం పారదర్శకంగా నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపసర్పంచ్ బొబ్బిలి రాజు, వార్డు సభ్యులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొని గ్రామంలో అమలవుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బండి సామి మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, అధికారులు–ప్రజలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఉపసర్పంచ్ బొబ్బిలి రాజు మాట్లాడుతూ వార్డుల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు విన్నవించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, ఇందారపు సారయ్య, తిర్రి అశోక్, ఓన్న తిరుపతిరావు, కామ బాపు, వివిధ శాఖల క్షేత్రస్థాయి అధికారులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రచారంలో రావుల వినయ్ జోరు

### 7వ వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థి విస్తృత ప్రచారం

అక్షర దర్బార్, కేసముద్రం: మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 7వ వార్డులో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రావుల వినయ్ ప్రచారం జోరుగా కొనసాగుతోంది. శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించిన ఆయన కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. విద్యావంతుడు, యువకుడైన వినయ్ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటారని, అవసరమైతే క్షణాల్లో స్పందించే నాయకుడని స్థానికులు పేర్కొన్నారు. వినయ్‌ను గెలిపిస్తే నిరుపేదలకు న్యాయం జరుగుతుందని, వార్డు అభివృద్ధికి కొత్త దిశ వస్తుందని ప్రజలు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కముటం శ్రీనివాస్, తోట శ్రీనివాస్, కముటం శ్రీరంగం, నాగన్న, నాగుల్, జానీ, రమేష్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు మంత్రి సీతక్క ప్రశంసలు



అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి: కాకతీయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ యూత్ ఫెస్టివల్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పీఎం శ్రీ బండారుపల్లి మోడల్ స్కూల్ విద్యార్థినులను మంత్రి సీతక్క అభినందించారు. విద్యార్థినులు యూనివర్సిటీ స్థాయిలో ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు.

## పరకాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

### ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

అక్షర దర్బార్, పరకాల: పరకాల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు దొమ్మటి సాంబయ్య, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి బిక్షపతి పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే పరకాల పట్టణాన్ని మోడల్ మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తామని రేవూరి హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.





# జర్నలిస్టులకు గుడ్ న్యూస్..

- 9 నుంచి అక్రిడిటేషన్ల దరఖాస్తులు
- తెలంగాణ మీడియా అక్రిడిటేషన్ రూల్స్-2025 విడుదల
- జీవో నెం. 252 జారీ.. మహిళలకు 33 శాతం కోటా

అక్షర దర్బార్, హైదరాబాద్ : రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. జర్నలిస్టుల అక్రిడిటేషన్ల జారీ కోసం 'తెలంగాణ మీడియా అక్రిడిటేషన్ రూల్స్-2025'ను అధికారికంగా విడుదల చేస్తూ సమాచార పౌర సంబంధాల శాఖ జీవో నెం. 252ను జారీ చేసింది. కొత్త నిబంధనల ప్రకారం అక్రిడిటేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. అర్హులైన ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా ప్రతినిధులు ఈ నెల 9వ తేదీ నుంచి సమాచార పౌర సంబంధాల శాఖ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

### మహిళా జర్నలిస్టులకు పెద్దపీట

నూతన నిబంధనల ప్రకారం మీడియా రంగంలో మహిళలకు ప్రాధాన్యత పెంచేలా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డెస్క్ జర్నలిస్టుల కేటాయింపులో మీడియా సంస్థలు కనీసం 33 శాతం మహిళలకు కేటాయించడం తప్పనిసరి చేశారు. అక్రిడిటేషన్ కోటాలోనూ మహిళా జర్నలిస్టులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. కాగా, అక్రిడిటేషన్ కార్డుల కాల పరిమితి రెండేళ్లు ఉండనుంది.

### జిల్లా, రాష్ట్ర స్థాయిలో కమిటీల ఏర్పాటు

అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియను పర్యవేక్షించేందుకు జిల్లా మరియు రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర స్థాయి అక్రిడిటేషన్ కమిటీకి (ఎస్ మాక్ ) మీడియా అకాడమీ చైర్మన్ అధ్యక్షత వహించగా, ఐ అండ్ పీఆర్ కమిషనర్ కో-చైర్మన్‌గా వ్యవహరిస్తారు. అదేవిధంగా జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ కమిటీకి చైర్మన్‌గా ఉంటారు. ఈ కమిటీలలో జర్నలిస్టు సంఘాల ప్రతినిధులకు కూడా ప్రభుత్వం కీలకమైన స్థానం కల్పించింది.

### దుర్వినియోగం చేస్తే చర్యలు తప్పవు

అక్రిడిటేషన్ పొందిన ప్రతినిధులు కార్డులను కేవలం వృత్తిపరమైన అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. తమ విజిటింగ్ కార్డులు లేదా లెటర్ హెడ్‌లపై 'ప్రభుత్వ గుర్తింపు పొందిన' (Accredited to Government) అని ముద్రించుకోకూడదని కొత్త అక్రిడిటేషన్ రూల్స్ హెచ్చరిస్తున్నాయి. ఒకవేళ కార్డు పోగొట్టుకుంటే, డూప్లికేట్ కార్డు కోసం రూ. 250 రుసుము చెల్లించాల్సి ఉంటుందని అధికారులు వెల్లడించారు.

# మత్తు పదార్థాలు, మూఢనమ్మకాలపై పోలీస్ కళాజాత

అక్షర దర్బార్, శాయంపేట: వరంగల్ నగర పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జాగృతి పోలీస్ కళా బృందం శాయంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మాందారిపేట గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించింది. గంజాయి, డ్రగ్స్, గుట్కా వంటి మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై యువతను చైతన్యపరిచారు. మత్తు పదార్థాల విక్రయం లేదా వినియోగంపై సమాచారం ఇవ్వాలంటే 8712584473 నంబర్‌కు తెలియజేయాలని సూచించారు. మూఢనమ్మకాలు, రోడ్డు ప్రమాదాలు, బాల్య వివాహాలు, బాల కార్మికులు, సైబర్ నేరాలపై నాటికలు, పాటల ద్వారా అవగాహన కల్పించారు. సైబర్ హెల్ప్‌లైన్ 1930 గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో శాయంపేట ఎస్ఐ పరమేశ్, గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




# రాజకీయ 'కత్తెర'లో మహిళలకు ఉపాధి

- మూడేళ్లుగా బడిలోనే 'బందీ' అయిన కుట్టుమిషన్లు!
- సింగరేణి సంస్థ ఔదార్యం.. రాజకీయ నాయకుల పంతం
- మొగుళ్ళపల్లి మండలంలో తుప్పు పడుతున్న కుట్టుమిషన్లు
- 50 మిషన్లలో కొన్ని మాయం.. ఎంక్వయిరీ చేస్తామంటున్న అధికారులు



అక్షరదర్బార్, మొగుళ్ళపల్లి : దేవుడు వరమిచ్చినా పూజారి కనికరించలేదన్న సామెత జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్ళపల్లి మండలంలో అక్షరాలా నిజమవుతోంది. సింగరేణి సంస్థ మహిళల ఆర్థిక పురోగతి కోసం కోట్లాది రూపాయల అభివృద్ధి నిధులను వెచ్చిస్తుంటే, క్షేత్రస్థాయిలో రాజకీయ విభేదాలు, అధికారుల నిర్లక్ష్యం ఆ నిధులను బూడిదలో పోసిన పన్నీరుగా మారుస్తున్నాయి. గత మూడు సంవత్సరాలుగా మొట్లపల్లి పాఠశాల గదుల్లో మూలుగుతున్న కుట్టుమిషన్లే దీనికి నిదర్శనం.

### - ఉపాధి కల్పనపై సింగరేణి ఆశయం

భూపాలపల్లి నియోజకవర్గంలోని మహిళా సమాఖ్య గ్రూపులను ఆర్థికంగా బలోపేతం చేయాలనే సంకల్పంతో సింగరేణి యాజమాన్యం ఉచిత కుట్టుమిషన్ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మొట్లపల్లి క్లస్టర్‌ను ఏర్పాటు చేసి గుండ్లకర్తి, వేములపల్లి, మెట్టుపల్లి, మొట్లపల్లి గ్రామాలకు చెందిన మహిళలకు ప్రత్యేక శిక్షణ కూడా ఇప్పించాలని ఏర్పాట్లు చేశారు. శిక్షణకు సిద్ధమైన 50 మంది మహిళలకు ఉపాధి కల్పించేందుకు మిషన్లను ఇవ్వాలని ప్రొసీడింగ్స్ రెడీ చేశారు.

### - రాజకీయ చక్రబంధంలో 'కుట్టు' చక్రాలు

మిషన్ల పంపిణీకి సిద్ధమవుతున్న తరుణంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడం మొదటి అడ్డంకిగా మారింది. అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో పాత ప్రొసీడింగ్స్ పక్కన పడ్డాయి. దీనికి తోడు స్థానిక నాయకుల మధ్య ఆధిపత్య పోరు మొదలైంది. లబ్ధిదారుల జాబితా విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గాల మధ్య ఏర్పడిన విభేదాలు మహిళల ఆశలపై నీళ్లు చల్లాయి. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అర్హులను గుర్తించి కొత్త ప్రొసీడింగ్స్ ఇవ్వాలని సూచించినప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోలేదు.

### - తుప్పుపడుతున్న మిషన్లు.. మాయమవుతున్న సామాగ్రి

మొట్లపల్లి జెడ్పీహెచ్ఎస్ స్కూల్లో భద్రపరిచిన ఈ కుట్టు మిషన్లు ప్రస్తుతం దుమ్ము పట్టి, తుప్పు పట్టే స్థితికి చేరుకున్నాయి. మహిళల జీవితాలను కుట్టాల్సిన ఈ మిషన్లు ఇప్పుడు పాత సామాన్ల కింద అమ్ముడయ్యే ప్రమాదం ఉంది. మరో ఆందోళనకరమైన విషయం ఏంటంటే, ఉండాల్సిన 50 మిషన్లలో కొన్ని ఇప్పటికే అధికార దుర్వినియోగంతో మాయమయ్యాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అవి ఎవరికి వెళ్లాయో, ఎవరు తీసుకున్నారో అధికారులకే తెలియని పరిస్థితి నెలకొంది.

### - అర్హులకే అందజేస్తాం

ఈ వివాదంపై మొగుళ్ళపల్లి ఏపీఎం రమాదేవి స్పందిస్తూ.. "ఉన్నతాధికారుల సూచనల మేరకు అర్హులైన మహిళలను గుర్తించి పంపిణీ చేస్తాం. మొట్లపల్లిలో ఉండాల్సిన 50 కుట్టు మిషన్లలో ఏవైనా తగ్గాయా అనే విషయంపై ఆరా తీస్తాం. దీనిపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇస్తాం" అని తెలిపారు. రాజకీయ పంతాలను పక్కన పెట్టి, సింగరేణి సంస్థ కల్పించిన ఈ ఉపాధి అవకాశాన్ని మహిళలకు త్వరగా అందేలా చూడాలని జిల్లా యంత్రాంగాన్ని బాధితులు కోరుతున్నారు.

# సీఎం సభను సక్సెస్ చేయండి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- చెల్పూరులో భారీ బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన



అక్షరదర్బార్, గణపురం : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 8న భూపాలపల్లి నియోజకవర్గ పర్యటనకు రానున్న నేపథ్యంలో, గణపురం మండలం చెల్పూరు గ్రామ శివారులో నిర్వహించతలపెట్టిన భారీ బహిరంగ సభ ఏర్పాట్లను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శుక్రవారం స్వయంగా పరిశీలించారు. సభా వేదిక నిర్మాణం, హెలీ ప్యాడ్ ఏర్పాటు, జన సమీకరణపై ఎమ్మెల్యే అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభకు వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా మంచినీరు, విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం ఉండకూడదని ఆదేశించారు. వాహనాల పార్కింగ్ విషయంలో సామాన్య ప్రజలకు ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. సభా వేదిక పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి సిద్ధం చేయాలని కాంట్రాక్టర్లకు, అధికారులకు స్పష్టం చేశారు. సీఎం పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

# పీఎస్ లో సీపీ తనిఖీ



అక్షరదర్బార్, రఘునాథపల్లి: రఘునాథపల్లి పోలీస్ స్టేషన్ ను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలించి, రికార్డ్ రూమ్, స్టేషన్ రైటర్ రూమ్, రిసెప్షన్ సెంటర్, ఇతర విభాగాలను తనిఖీ చేసి, వాటిని తగిన విధంగా సంరక్షించుకోవాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలోని నేరాల రేటు, రోడ్డు ప్రమాదాలు, చోరీ కేసులు, నమోదైన కేసుల పురోగతిపై సీపీ ఆరా తీశారు. అధికారులు, సిబ్బంది పనితీరును మరింత మెరుగు పరుచుకుని చేపట్టాల్సిన విధి విధానాలపై సంబంధిత స్టేషన్ ఎస్ఐ, సర్కిల్ ఇన్స్ స్పెక్టర్ కు తగిన సూచనలు చేశారు. ప్రధానంగా ప్రస్తుతం రఘునాథపల్లి మండలం దాని పరిసర ప్రాంతాలలో పెద్దపులి సంచరిస్తున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేసి, ఎటువంటి ప్రాణనష్టం లేదా ఆస్తినష్టం జరగకుండా ఫారెస్ట్ సిబ్బందితో సమన్వయం చేసుకొని తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సీపీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఘనపూర్ ఏసీపీ భీం శర్మ, సర్కిల్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, రఘునాథపల్లి ఎస్ఐ నరేష్ సిబ్బంది పాల్గొన్నారు.

# అడవిలో తూటాల గర్జన

- తొమ్మిది మంది మావోల ఖతం!
- ఛత్తీస్ గఢ్-మహారాష్ట్ర సరిహద్దులో భారీ ఎన్ కౌంటర్

అక్షర దర్బార్, ప్రధాన ప్రతినిధి : మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా కేంద్రం చేపట్టిన 'ఆపరేషన్ కగార్' అడవిని వణికిస్తోంది. ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్ మరువకముందే, తాజాగా ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర సరిహద్దులో మరో భారీ కాల్పుల మోత మోగింది. గడ్చిరోలి-నారాయణపూర్ జిల్లాల సరిహద్దులోని పొదెవాడ అటవీ ప్రాంతంలో జరిగిన ఈ భీకర పోరులో తొమ్మిది మంది మావోయిస్టులు మృతి చెందారు.

### గాలింపుతో మొదలైన సమరం

పొదెవాడ అడవుల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారన్న పక్కా సమాచారంతో సీ-60 కమాండోలు రంగంలోకి దిగారు. బలగాల రాకను గమనించిన మావోలు కాల్పులకు తెగబడటంతో కమాండోలు ఎదురుదాడి ప్రారంభించారు. సుమారు 24 గంటలుగా కొనసాగుతున్న ఈ ఆపరేషన్‌లో భారీగా ఆయుధ సంపత్తి దొరికింది. స్పాట్‌లో ఏకే-47, ఎస్ఎల్ఆర్ సహా అత్యాధునిక తుపాకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని ఉన్నతాధికారులు వెల్లడించారు.

### కమాండో మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

ఈ కాల్పుల ఘటనలో పోలీసు బలగాలకు భారీ నష్టం వాటిల్లింది. మావోయిస్టులు జరిపిన మెరుపు దాడిలో సీ-60 బెటాలియన్‌కు చెందిన కమాండో దీపక్ ముదావి ప్రాణాలు కోల్పోయారు. మరో కమాండో తీవ్రంగా గాయపడటంతో హెలికాప్టర్ ద్వారా ఎయిర్ లిఫ్ట్ చేసి ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అడవిని అదనపు బలగాలతో జల్లెడ పడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# నక్సల్ ఫ్రీ భారత్.. షా నజర్!

- బస్తర్ అడవుల్లో 'అమిత్' వ్యూహం..
- ఎల్లుండి జవాన్లతో కీలక భేటీ

అక్షర దర్బార్, ప్రధాన ప్రతినిధి : నక్సలిజాన్ని దేశం నుంచి పూర్తిగా తుడిచిపెట్టేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా 'మిషన్ 2026'ను వేగవంతం చేశారు. మార్చి 31 గడువు సమీపిస్తున్న నేపథ్యంలో, నక్సల్స్ ఏరివేతకు సంబంధించి ఫైనల్ స్ట్రాటజీని ఖరారు చేసేందుకు ఆయన నేడు రాయ్‌పూర్ చేరుకుంటున్నారు. మూడు రోజుల పాటు ఛత్తీస్‌గఢ్‌లో పర్యటించనున్న ఆయన, అడవి బిడ్డలు, జవాన్లలో భరోసా నింపడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేశారు.

### రాష్ట్రాల ఉన్నతాధికారులతో భేటీ

నేడు సాయంత్రం రాయ్‌పూర్ చేరుకోనున్న అమిత్ షా, తొలుత భద్రతా సంస్థలతో ప్రాథమిక సమీక్ష నిర్వహిస్తారు. రేపు (ఫిబ్రవరి 7న) ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల డీజీపీలు, ఉన్నతాధికారులతో కలిసి హైలెవల్ సెక్యూరిటీ మీటింగ్‌లో పాల్గొంటారు. ఈ భేటీలో 'ఆపరేషన్ కగార్' పురోగతిని సమీక్షించి, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో తదుపరి చర్యలపై రోడ్ మ్యాప్ ఖరారు చేస్తారు.

### బస్తర్ క్షేత్రస్థాయికి హోంమంత్రి

ఈ పర్యటనలో అత్యంత కీలకమైన అంశం జవాన్లతో ముఖాముఖి. ఈ నెల 9న అమిత్ షా నేరుగా బస్తర్ క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లనున్నారు. అక్కడ విధుల్లో ఉన్న జవాన్లతో నేరుగా మాట్లాడి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సవాళ్లను అడిగి తెలుసుకోనున్నారు. కేంద్రం విధించిన గడువులోగా లక్ష్యాన్ని చేరుకోవడానికి ఈ పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.



# 12వ వార్డులో హస్తం హవా

### అట్టహాసంగా డాక్టర్ ప్రమీల ప్రచారం

అక్షర దర్బార్, మరిపెడ: మరిపెడ మున్సిపాలిటీలోని 12వ వార్డులో కాంగ్రెస్ పార్టీ ప్రచారం జోరుగా సాగుతోంది. స్థానిక ఎమ్మెల్యే రామచంద్రు నాయక్ సతీమణి, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ జాటోత్ ప్రమీల రామచంద్రు నాయక్ శుక్రవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 12వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి షేక్ అజీజ్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించారు.

# స్పీకర్ సార్.. ఇక సాగదీత వద్దు!

- ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీం సీరియస్..
- 'మూడు వారాలే' డెడ్ లైన్





అక్షర దర్బార్, హైదరాబాద్ : ఫిరాయింపు ఎమ్మెల్యేల భవితవ్యంపై తేల్చడంలో జరుగుతున్న జాప్యంపై దేశ అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు సుప్రీంకోర్టు 'లాస్ట్ వార్నింగ్' ఇచ్చింది. నిర్ణీత గడువులోగా అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోకపోతే, దానిని కోర్టు ధిక్కరణగా భావిస్తామని హెచ్చరిస్తూ.. కేసు విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

### మున్సిపల్ ఎన్నికల సాకు..

జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్, జస్టిస్ సంజయ్ కరోల్‌లతో కూడిన బెంచ్ శుక్రవారం ఈ కేసును విచారించింది. ప్రభుత్వం తరపున వాదనలు వినిపించిన సీనియర్ అడ్వకేట్ అభిషేక్ మను సింఘ్వీ.. ప్రస్తుతం రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోందని, అందువల్ల స్పీకర్ బిజీగా ఉన్నారని కోర్టుకు వివరించారు. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి మరో మూడు వారాల సమయం కావాలని విన్నవించారు.

### కోర్టు ధిక్కరణ తప్పదు..

ప్రభుత్వ అభ్యర్థనను మన్నిస్తూనే ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు చేసింది. "మేము ఇప్పటికే స్పీకర్‌కు సరిపడా సమయం ఇచ్చాం. ఇదే ఆఖరి అవకాశం. బీ పాజిటివ్.. అంటే సానుకూల నిర్ణయంతో రావాలి" అని స్పష్టం చేసింది. ఒకవేళ వచ్చే విచారణ సమయానికి కూడా స్పీకర్ తన నిర్ణయాన్ని ప్రకటించక పోతే, కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని ధర్మాసనం సూచించింది.

# 13వ వార్డులో బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం



అక్షర దర్బార్, కేసముద్రం: కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కన్నబోయిన సుజా శ్రీనివాస్ ప్రచారం ఊపందుకుంది. శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలుకాలేదని విమర్శించారు. ఒక్కసారి అవకాశం ఇస్తే వార్డును అభివృద్ధి చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు. ప్రచారంలో ప్రజల నుంచి మంచి స్పందన లభించింది.

# కాంగ్రెస్ లో చేరిన మాజీ ఎంపీపీ సుధీర్



అక్షర దర్బార్, ములుగు ప్రతినిధి: ములుగు జిల్లా కేంద్రంలో రాష్ట్ర మంత్రి సీతక్క సమక్షంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ములుగు మాజీ ఎంపీపీ గండ్రకోట సుధీర్ తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి సీతక్క వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు.



# పరకాలలో కాషాయ విజయమే లక్ష్యం

### డా. పగడాల కాళీ ప్రసాద్ రావు

పరకాల మున్సిపల్ ఎన్నికల సందర్భంగా 3వ వార్డు అభ్యర్థి వేముల సదా రాణి ఆంజనేయులు, 12వ వార్డు అభ్యర్థి ఆకుల లావణ్య శ్రీధర్ లకు మద్దతుగా నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్స్‌లో బీజేపీ జిల్లా నాయకులు సంతోష్ రెడ్డి, రాష్ట్ర నాయకులు, పరకాల నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డా. పగడాల కాళీ ప్రసాద్ రావు , ఎన్నికల కన్వీనర్ డాక్టర్ సంతోష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అభివృద్ధి బాటలో సాగుతోందని, అదే ప్రగతి మున్సిపాలిటీల్లో రావాలంటే బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. మాటలతో కాదు, పనులతో అభివృద్ధి చేసే పార్టీ బీజేపీనేనని పేర్కొన్నారు. పరకాల మున్సిపల్ ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి బీజేపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా, రాష్ట్ర, పట్టణ స్థాయి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# ములుగు మున్సిపాలిటీపై ఎగిరేది కాషాయం జెండా

### బీజేపీ నేత, మాజీ ఎంపీ సీతారాం నాయక్

అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి: మున్సిపాలిటీ ఎన్నికల్లో ఓటమి భయంతోనే బిజెపి అభ్యర్థులను కాంగ్రెస్ నాయకులు బెదిరింపులకు పాల్పడుతున్నారని మాజీ ఎంపీ సీతారాం నాయక్ అన్నారు.ములుగు జిల్లా కేంద్రంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎంపీ సీతారాంనాయక్,వరంగల్ మాజీ మేయర్ డా రాజేశ్వర్ రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ ఎంపీ సీతారాంనాయక్ మాట్లాడుతూ ములుగు మున్సిపాలిటీ పై ఎగిరేది కాషాయం జెండానే అని అన్నారు.మున్సిపాలిటీ ఎన్నికల్లో బిజెపి కాంగ్రెస్ మధ్యనే పోటీ అని,ములుగులో బిఆర్ఎస్ కనుమరుగైపోయిందని చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వం ములుగు జిల్లాకు ఏం చేసిందో చెప్పాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని,మంత్రి సీతక్కను ప్రశ్నించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలోనే ములుగు జిల్లాలో రామప్పకు యునెస్కో గుర్తింపు,గిరిజన యూనివర్సిటీ,కేంద్రీయ విద్యాలయం కేటాయించామని వివరించారు.మున్సిపల్ ఎన్నికల్లో బిజెపికి పట్టం కడితే ములుగు పట్టణాన్ని అభివృద్ధి చేసి చూపెడతామని తెలిపారు. ఏ వార్డుకు వెళ్లినా బీజేపీ కి పట్టం కడుతున్నారని అన్నారు. ములుగు జరుగుతున్న మొదటి మున్సిపాలిటీ ఎన్నికల్లో ఎక్కువ వార్డులు గెలుచుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు

# గంటకో జెండా..!

- ఎవరికి ఓటు వేస్తారోనని అభ్యర్థుల ఆందోళన
- మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్ల లీలలు

అక్షర దర్బార్, పరకాల: పరకాల మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ఒకే వార్డులో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థుల ప్రచారంలో ఒకే వ్యక్తులు గంటకో పార్టీ జెండా పట్టడం చర్చనీయాంశంగా మారింది. దీంతో అసలు ఓటు ఎవరికి వేస్తారో తెలియక అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.









# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

*డిజిటల్ విప్లవంలో భాగంకండి!*

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915